


# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



8

# అమెరికాలో "పాడుతా..తీయగా.."

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. గత ఆరేడు నెలల క్రితం దాకా మా టీవీలో “ఈటీవీ” వచ్చేది కాదు. పైగా నాకు యు-ట్యూబులు, మై - ట్యూబులు, హెర్ అండ్ హిజ్ ట్యూబులు చూడడం అలవాటు లేదు. అందు చేత ఈ “పాడుతా, తీయగా, చల్లగా ” కార్యక్రమం ప్రఖ్యాతి గురించి వినడమే కానీ ఎప్పుడూ చూడ లేదు. కానీ ఇప్పుడు డిష్ నెట్ వర్క్ లో సోమవారం రాత్రి వచ్చే ఈ పాటల పోటీని తప్పని సరిగా చూస్తూ, ప్రతీ సారీ దంగై పోతున్నాను. గత ఏప్రిల్ లో నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఎస్.పి. బాలు గారు ఏదో మాటల సందర్భంలో తానా సభలలో “పాడుతా తీయగా” మొదటి ప్రోగ్రాం చేస్తున్నాం, తప్పకుండా రమ్మని చెప్పగానే డబుల్ దంగై పోయాను. “ఓరి నాయనోయ్” అని కూడా అనేసుకుని అసలు ఈ కార్యక్రమం పుట్టుపుర్వోత్తరాల గురించి “ఆరా” తీశాను. అనగా "గూగులిం” చ గానీ మరింత ఆశ్చర్యము, ఆనందమూ కలిగి అమెరికాలో ఆ ప్రోగ్రాం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూడడం మొదలు పెట్టాను. ఎందుకంటే ఇండియాలో మాబోటి వాళ్ళకి అటువంటి అవకాశం రానే రాదు.

“పాడుతా తీయగా: గురించి టూకీగా చెప్పాలంటే ... సుమారు ఇరవై ఏళ్ళ క్రితం నిష్టల భైరవ శాస్త్రి అనే ఒకాయనకి ఒక మహా మాంచి ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ని కొంత మందితో పంచుకోగానే “మనవాళ్ళకి ఇలాంటివి పనికి రావు సార్” అని నిరాశ పెట్టిన వారు కొందరు ఉన్నా...ఆ ఆలోచన లో ఉన్న “పస” తన దూరదృష్టితో కనిపెట్టి అది భుజాలకెత్తుకున్న మహానుభావుడు, ఈటీవీ అధినేత రామోజీ రావు గారు. అప్పటి నుంచీ ఇప్పటి దాకా ఆ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా ప్రతీ ప్రసారాన్నీ ఎనభై లక్షల తెలుగు వారు చూసి ఆనందించి అబ్బుర పడే విధంగా నిర్వహిస్తున్నది మన గాన గంధర్వుడు ఎస్.పి. బాలసుబ్రమణ్యంగారు. దక్షిణ భారత టెలివిజన్ చరిత్రలో తొలి “రియాల్టీ షో” గా అద్భుతమైన విజయాన్ని సాధించిన, సాధిస్తున్న ఆ “పాడుతా తీయగా చల్లగా” పాటల పోటీ తెర వెనుకా, తెర ముందూ కూడా తానే సంగీత సారధిగా బాలూ నిర్వహిస్తున్న ఈ పాటల పోటీలో పాల్గొని ఈనాడు

ప్రముఖ గాయనీ గాయకులుగా పేరు తెచ్చుకున్న వారిలో పార్థు, మల్లికార్జున్,ఉష, సందీప్, కారుణ్య, హేమచంద్ర, గోపిక పూర్ణిమ, కౌసల్య వేణు, గీతా మాధురి మొదలైన వారు ఉన్నారన్నా, అక్కినేని, చిరంజీవి, సిరివెన్నెల, వేటూరి, పి. సుశీల, కె.విశ్వనాథ్, బాపు-రమణ మొదలైన వారు ప్రత్యేక ఆహ్వానితులు గా ఈ కార్యక్రమానికి వచ్చి తమ అభినందనలని తెలిపారు అన్నా, తెలుగు సంస్కృతిని, సినీ & లలిత సంగీతాలని ఈ "పాడుతా తీయగా " కార్యక్రమం ఎంత ప్రభావితం చేస్తోందో మనం ఊహించ వచ్చును. అటువంటి ఉత్తేజపూరితమైన యువతీ యువకుల పాటల పోటీని మొట్ట మొదటి సారిగా భారత దేశం సరిహద్దులు దాటి ఉత్తర అమెరికాలో నిర్వహించి స్థానిక ప్రేక్షకుల సమక్షంలో రికార్డింగ్ చేసే ఆలోచన చేసి, తొలి కార్యక్రమాన్ని గత మే నెలలో డల్లాస్ లో జరిగిన 19 వ మహాసభలలో విజయవంతంగా నిర్వహించిన తానా సంస్థ కి అమెరికా తెలుగు వారి తరఫున ధన్యవాదాలు.

ఇక గత ఏప్రిల్ లో నేను అమెరికా వెనక్కి రాగానే ఒక రోజు నవ్య అనే అమ్మాయి ఎంతో శ్రావ్యమైన గొంతుకతో నాకు ఫోన్ చేసి "మేము ..అనగా సియాటిల్ లో ఉన్న పీపుల్ మీడియా సంస్థ వారు అమెరికాలో న్యూయార్క్, సియాటిల్, లాస్ ఏంజెలేస్ వగైరా ఆరు నగరాలలో పాడుతా తీయగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాటిల్లో ఒకటి మీరు స్పాన్సర్ చేస్తే బావుంటుంది. ఫైనల్స్ నాట్స్ సంబరాలలో జరుగుతాయి.?" అని మనసారా కోకిల లాగా కూసింది. ఆ సంస్థ అధ్యక్షులు విశ్వ ప్రసాద్ నాకు తెలుసును. మంచి వాడు. నేను ఏదో టికెట్టు కొనుక్కుని ప్రోగ్రాం లకి వెళ్ళే బాపతు గాడిని అని అమెరికాలో అందరికీ తెలుసు కాబట్టి ఇలాంటి "ఆఫర్" నాకు రావడం తో కొంచెం భయం వేసింది. "ఆఫర్" అని ఎందుకు అన్నానూ అంటే....మనల్ని భారీగా డబ్బు అడిగే వాళ్ళు "మీకు అవకాశం ఇస్తున్నాం " అనో "మీకు ఇది మంచి ఆఫర్" అనో మర్యాదగా డబ్బు అడుగుతారు...అక్కడికి ఆ స్పాన్సర్ షిప్ అవకాశం అందుకోడానికి చాలా మంది లైన్ లో నుంచుని ఉన్నట్టు కొంచెం బిల్డ్ అప్ కూడా ఇస్తారు. ఈ నవ్య అనీ అమ్మాయి అలా కాకుండా పాపం ఉన్న మాట ఉన్నట్టే చెప్పింది కాబట్టి కాస్త టెంప్ట్ అయిపోయాను...అందులోనూ ఇది అమెరికాలో మొట్ట మొదటి సారిగా జరుగుతున్న గొప్ప కార్యకమం కదా..కానీ మన దగ్గర డబ్బు దస్కాలకి ఎప్పుడూ లోసుగే కాబట్టి "అన్ని ప్రోగ్రాములూ ఎక్కడో పై ఊళ్ళలో ఉన్నాయి కదా. మా హ్యూస్టన్ లో తీయగా, చల్లగా పాడితే గేరంటీ గా స్పాన్సర్ చేస్తాను" అని కమిట్ అయిపోయి అప్పటికి ఆ గండం గట్టేక్కాను. మరొక పది రోజుల తరవాత స్వయానా బాలూ గారి దగ్గర నుంచి 'జూన్ 29, 30 లలో మీ హ్యూస్టన్ లో మా ప్రోగ్రాం ఇప్పుడే కన్ఫర్మ్ అయింది . ఐదారు రోజులు ఉంటాను. ఎక్కడికీ పారిపోకండి. " అని మెసేజ్ వచ్చింది. అప్పుడు నా అంతట నేనే నవ్య ని పిలిచి నా వాక్కూ-దానము వెరసి వాగ్దానం నిలబెట్టుకున్నాను. ..అనగా హ్యూస్టన్ కార్యక్రమానికి ఒక స్పాన్సర్ గా నమోదు చేసుకున్నాను. "తప్పులో కాలేశావు" అని మా క్వీన్ విక్టోరియా కోప్పడబోయింది కానీ ఈ "కెవ్వు కేక" ల యుగంలో ..ఏ మాత్రం వీలున్నా ఇలాంటి కార్యక్రమాలని అందరూ సమర్థించ వలసినదే అని తనుకూడా ఒప్పేసుకుంది.



ఇంతలో ఎదురు చూసిన ముహూర్తం రానే వచ్చింది. మే నెలాఖరున 19 వ తానా మహా సభలలో మెగా స్టార్ చిరంజీవి చేత ప్రారంభించబడిన ఆ అమెరికాలో మొట్ట మొదటి "పాడుతా తీయగా " కార్యక్రమం..నిజంగానే ...నేనూ, తనికెళ్ళ భరణి, జొన్నవిత్తుల, గొల్లపూడిగారు మొదటి వరసలో కూచుని ఆనందించాం. కావాలంటే అప్పటి ఫోటో ఇందుతో జత పరుస్తున్నాను...చూడండి.

అన్నట్టు డాలస్ లో జరిగిన 19 వ మహా సభలలో తానా వారు సాహిత్యానికి వేసిన పెద్ద పీట, సాహితీవేత్తలకి ఇచ్చిన గౌరవం మేచ్చుకోదగ్గవి. ఏదో మొక్కు బడిలా కాకుండా, చిత్త శుద్ధితో అత్యధిక సంఖ్యలో సాహితీ వేత్తలని రచయితలని ఇండియా నుంచి, అమెరికాలో అన్ని నగరాల నుంచీ ఆహ్వానించి, ఖర్చులు పెట్టి, పారితోషికాలు కూడా ఇవ్వడం చాలా అభినందనీయం.

ఇక జూన్ నెలాఖరు వస్తోందీ అనగానే మా హ్యూస్టన్ అంతా సందడే సందడి. ముఖ్యంగా నా బోటి బాలు అభిమానులకి ఆయన ఐదారు రోజులు ఇక్కడ ఉంటున్నారు అంటే పండగే కదా. పైగా ఈటీవీ వారి "పాడుతా తీయగా" బృందం అంతా కలిసి సుమారు నలభై మంది రావడంతో అందరికీ చెయ్య వలసిన ఏర్పాట్లకి చాలా మంది ...ముఖ్యంగా మా ఆస్థాన గాయనీ మణులు శ్రీమతి మణి శాస్త్రి, శారద ఆకునూరి, కృష్ణ కీర్తి, రాజ్ పసల, రఘు నేదునూర్, రామ్మోహన్ చెరువు మొదలైన వారు

విపరీతమైన శ్రమ పడ్డారు. నేను ఉత్సవ విగ్రహంలా ఊరేగుతూ మహదానంద పడ్డాను. మా ఊళ్లో రోజుకి మూడు చొప్పున రెండు రోజుల లోనూ మొత్తం ఆరు "పాడుతా తీయగా" పాటల పోటీలు జరిగాయి. అందులో నాలుగు సెమి-ఫైనల్స్ అయితే రెండు ఫైనల్స్. ఒక్కొక్క పోటీకి స్టేజ్ ని ఒక్కొక్క రకంగా తీర్చిదిద్దారు. ఉదాహరణకి రాబోయే డిశంబర్ నెలాఖరున ప్రసారం అవబోయే ఎపిసోడ్ వేదిక ని బెలూన్లు, బూరాలతో ఆలంకరించి కొత్త సంవత్సరం ..అంటే 2014.. కి ఆహ్వానం పలుకుంటున్న వాతావరణం సృష్టించారు. అలాగే మరొకటి అరటి చెట్ల తోటీ, గాలి పడగలతోటీ వేదికని నింపేసి...సంక్రాంతి పండగ వాతావరణం కలిగించారు. ఈ ముందర ప్లానింగ్ అంతా ఈటీవీ బృందం వారిదే! దానికి నాయకుడు, నిర్మాత ఎన్.బి. శాస్త్రి గారే!...అంటే ఇరవై ఏళ్ల క్రితం "ఈ పాడుతా తీయగా" కార్యక్రమానికి తొలి పునాది వేసిన నిష్టల భైరవ శాస్త్రి గారే ఈనాటికీ అమెరికాలో కూడా నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహించారు. అలాగే ఆ బృందంలో అందరి తోటీ, ముఖ్యంగా వాద్య సహకారం అందించే చిన్నారావు, స్వామి, చిదంబరం, ఆరుగురు కెమెరా వారు, అరడజను సౌండ్ ఇంజనీర్లు, లైటింగ్ వారు మొదలైన వారి అద్భుతమైన ప్రజ్ఞాపాటవాలు, కలుపుగోలు తనం, ఎవరి పనులు వారు పద్ధతి ప్రకారం చేసుకు పోవడం చూస్తే ముచ్చట వేసింది. అసలు విశేషం ఏమిటంటే, నేను వీరిలో ఎవరిని అభినందించినా, అందరూ ఏకగ్రీవంగా చెప్పిన మాట ఒకటే "మాదేముంది సార్..అంతా బాలు గారి మాకు నేర్పిన క్రమ శిక్షణే. ఎక్కడా, ఏదీ స్థాయికి తగ్గ కూడదు. గీసుకున్న గీతలు ఎవరూ దాట కూడదు. ఆయనా దాటరు. ఎప్పుడూ మాతోనే ఉంటారు. అందుకే ఇన్నేళ్ళగా ఈ పాడుతా తీయగా నిలబడింది. ఐదారు తరాలకి సరిపడా గొప్ప గాయనీ గాయకులు పుట్టుకొచ్చారు."

ఇక ఈ సాంకేతిక నిపుణులందరూ ఒక ఎత్తయితే పోటీలో పాల్గొన్న అమెరికా అమ్మాయిలు, అబ్బాయిలు, వారిని పద్ధతిలో పాడించడానికి సహాయపడే సమన్వయ కర్తలే కాక ఇండియా నుంచి వచ్చిన ఇద్దరు సీనియర్లు...అంటే ఇది వరకటి పోటీలో ఫైనలిస్ట్ లు...హరిణి, తేజస్విని అందరూ ఈ కార్యక్రమానికి అత్యంత ప్రధానమైన వారే! ఇక్కడ ఒక చిన్న పిట్ట కథ చెప్పాలి...ఈ హరిణి అనే అమ్మాయి మా కాకినాడ. ఆ అమ్మాయిని అమెరికా రమ్మని ఈటీవీ వారు గత మార్చ లోనో ఎప్పుడో అడిగినప్పుడు తనకి పాస్ పోర్ట్ లేదు. ఆ అమ్మాయి తల్లిదండ్రుల కోరిక మీద నా ఆప్త మిత్రుడు వై.యస్. ఎన్. మూర్తి కాకినాడ నుంచి నన్ను పిలిచి నువ్వేమన్నా ఆ పని చేసి పెట్ట గలవా అని అడిగాడు. వెంటనే తానా అధ్యక్షులు తోటకూర ప్రసాద్ గారి తక్షణ స్పందనతో అర్జంటుగా ఆ ఆహ్వానం పంపించి ఆ అమ్మాయి కి సకాలంలో పాస్ పోర్ట్ అందేటట్టు చెయ్యగలిగాం.

మొత్తానికి సుమారు ఇరవై ఏళ్లగా తిరుగులేని విజయాన్ని సాధిస్తూ, మా అమెరికాలో, అందులోనూ మా హ్యూస్టన్ మహా నగరంలో తెలుగు సరిగ్గా రాని యువతీ యువకుల "పాడుతా తీయగా" పాటల పోటీ ని తన చతురోక్తులతో అందరినీ నవ్విస్తూ సమర్థవంతంగా నిర్వహించిన ఆత్మీయులు బాలూ గారికి, ప్రత్యేక న్యాయ నిర్ణేతగా వచ్చిన సుప్రసిద్ధ గేయ రచయిత, మిత్రులు చంద్ర బోస్ గారికీ మా ధన్యవాదాలు.




ఏది ఏమైతేనేం...అమెరికాలో నిర్వహించబడిన "పాడుతా తీయగా " పాటల పోటీలు బహుశా వచ్చే నెల నుంచి సుమారు ఆరు నెలలు ఇండియాలో ప్రసారం అవుతాయి. మా హ్యూస్టన్ లో టేప్ చెయ్యబడినవి డిశంబర్ (2013)-జనవరి (2014) లలో చూడవచ్చును అనుకుంటాను. ఇంతకీ నా అసలు, సిసలు సొంత డబ్బా ఏమిటంటే ..మా హ్యూస్టన్ లో జరిగిన కార్యక్రమాలలో "పద్మభూషణ్" బాలూ గారు నా హాస్య రచనల గురించీ, మా ఇద్దరి స్నేహం గురించీ ఎంతో ఆప్యాయంగా పలుమార్లు ప్రస్తావించారు. అంతే కాకుండా వేదిక మీద ఆయన స్వయంగా శాలువా మరియు పతకం తో సత్కరించిన ఇద్దరి లో నేనొక్కడినే మగాడిని. మా హ్యూస్టన్ తెలుగు వారందరి తరఫునా బాలూ గారికి చిరు సత్కారం చేసే అవకాశం నాకే దక్కింది. ఆ ఫోటో ఇక్కడ జతపరుస్తున్నాను. ఇదంతా ఎందు కంటే తీరా నిజంగా టీవీలో ఈ కార్యక్రమాలు ప్రసారం అయినప్పుడు ఆ ఎడిటర్ గారికి నా మొహం నచ్చక ఇవన్నీ ఎలాగా కట్ చేసి పారేస్తాడుగా...అందుకూ!

"సరేలే...నీ సుత్తి బాగానే రాసుకున్నావు కానీ ఈ వ్యాసం బాలూ గారికి పంపించకు...తనని మరీ అంత పొగిడే వాళ్ళనీ, తనని తానే అంత పొగుడుకునే వాళ్లనీ ఆయన కట్ చేసేస్తారేమో! చాలా మోడెస్ట్ మనిషి మరి." అంది మా క్వీన్ విక్టోరియా.

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

●●●

COMMENTS